ప్రేమించిన
అమ్మాయిపై
అతను
కసి పెంచుకోవడానికి
కారణం?

రచన
కొవెపు శివశేఖర్
కథ

# కసి

క్రసి!
ఎవరిమీదో తెలీదు.
కోపం!
ఎందుకో తెలిదు
ఉద్వేగం!
ఇది అసలే తెలీదు.

ఊరంతా పిచ్చికుక్కలా తిరిగాను. ఊరకుక్కల్ని రాళ్ళతో కొట్టి తరిమేశాను. ఆ ఏటి గట్టున కూర్చొని గడ్డిపూవుల్ని కోశాను. చెట్ల కొమ్మల్ని ఎక్కి కోతిలా వూగాను.

ఇవన్నీ నా పిచ్చిచేష్టలే కావచ్చు నాకు పిచ్చెక్కిందని మీరందరూ భ్రమపడొచ్చు. హేళనలు-అవమానాలు చేయవచ్చు వెక్కిరించవచ్చు వెలివేయవచ్చు

మొన్న రాత్రి అమ్మ ఏకధాటిగా ఏడ్చింది ఇంట్లో వున్న వస్తువుల్ని చెల్లాచెదురు చేసినందుకు

నిన్న పగలు నాన్న నా చెంపలు వాయించాడు ఇంట్లో వున్న పాతకాలం నాటి పందిరి మంచాన్ని విరగ్గొట్టినందుకు.

ఇవాళ చెల్లాయ్ నన్ను తెగ తిట్టింది. దాని పెట్లోవున్న చీరల్ని పేలికలుగా చింపినందుకు.

నాన్న కర్ర పట్టుకొని నన్ను వూరి మీదకు తరిమేశాడు

నా బాధను వీళ్ళెవరూ అర్థం చేసుకోరేం?

నాలో వున్న కసి కోపం ఉద్వేగాల్ని ఎవరూ పట్టించుకోరేం?

ఎంత గొప్పగా బ్రతికాను నేను!

ఏ ఒక్కరూ నన్ను వేలెత్తి చూపించలేకపోయారు. అందరిలోనూ మంచివాడిగా



గుర్తింపు తెచ్చుకున్నాను.
ఈనాడు యిలా అయిపోయానేమిటి?
నా మార్పు నాకే ఆశ్చర్యంగా వుంది.
నా తత్వం నాకే విచిత్రంగా వుంది. నా
చర్యలు నాకే వింతగా వున్నాయి.

ఓడిపోయాను.
కాదు-
మోసగింపబడ్డాను.
లేదు.
వంచింపబడ్డాను.

ఆ రాక్షసి...

ఇందిర

అందమైన మాటలతో...అవిమాటలా? కావు. అడకత్తెరలు

కవ్వించే కన్నులతో...అవికన్నులా? కావు కాల్చే నిప్పులు

విమూత్న నవ్వులతో...అవి నవ్వులా? కావు విషపు ధారలు

పూర్తిగా వూబిలో కూరుకుపోయాను. నా వ్యక్తిత్వం మంటగల్సిపోయింది. నేనో వెధవలా ఇందిర దృష్టిలో విలిచిపోయాను.

నేను వెధవని కాను.

కాను-అంటే యిప్పుడు నమ్మేవాళ్ళు ఎవరు?

నాన్న మొదటే హెచ్చరించాడు-"గొప్పవాళ్ళతో తలపడుకురా అబ్బాయ్ దెబ్బతింటావు" అని.

అప్పట్లో నాన్న మాట లెక్కజేస్తేగా!

అమ్మకూడా అమధ్య చెప్పుతూసింది- "ఇందిరతో ఆ తిరుగుళ్ళు మానేయరా అబ్బి వాళ్ళ నాన్నకు తెలిస్తే నీ చర్మం చీరేస్తాడు" అని.

ఆనాడు అమ్మమాట వింటేగా!

ఫలితంగా-

దెబ్బతినేశాను. చర్మం చీరేయించుకున్నాను.

ఆ మోహన్‌రావుగాడు నన్ను బెల్ట్‌తో కొడుతున్నప్పుడు - ఇం ది ర వికగబడి నవ్వింది. గర్వంగా నావేపు చూస్తుండిపోయింది.

"నిజం! కావాలంటే ఇందిరను అడగండి ఆమె నన్ను ప్రేమించింది మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం" గాయాల్లోంచి నెత్తురోడుతున్నా ఎలాగో ఆ మాటల్ని చెప్పగలిగాను

"ఈ లోఫర్ని నేను ప్రేమించడమా" అని పగలబడి నవ్వేసింది ఇందిర.

వంచకి... పాతకి... అని బిగ్గరగా అరవాలనిపించింది.

నౌకర్లచే మెడబట్టించి రోడ్డుమీదకు గెంటేయించాడు మోహనరావు గాడు.

ఎందుకిలా జరిగింది?

ఇందిర మా ఎదురింటి మోహనరావు గాడి కూతురని తెల్సు. మా ఎదురిల్లు అతి ఖరీదైన బిల్డింగ్ అని తెల్సు వాళ్ళకి నౌకర్లు కార్లు బొచ్చుకుక్కలు కావల్సినంత కరెన్సీ కూడా వుందని తెల్సు

అన్నీ తెల్సిండే ఇందిరను దగ్గరకు రానిచ్చాను.

ఆమె నన్ను మొదటిసారిగా పలకరించేంతవరకూ నాకు తెలీదు ఇందిర మా కాలేజీలోనే చదువుతోందని

"మీకు ఎకౌంట్స్ బాగా వచ్చటగా- రోజూ సాయంత్రం ఓ గంటసేపు మా యింటికి వచ్చి నాకు చె ప్ప కూ డ దు" ఎంతో అణకువగా మాట్లాడింది ఇందిర.

"ఏ లెక్చరర్ దగ్గరైనా ట్యూషన్ పెట్టించుకోండి"

"ఈ ముసలిపంతుళ్ళు ఎంత గొప్పగా చెప్పినా వాళ్ళ చాదస్తాన్ని భరించలేను"

తొందరపడి మాట ఇవ్వలేదు నేను. రెండురోజుల వరకూ ఆలోచిస్తూనే వుండిపోయాను.

ఓ సాయంత్రం ఎదురింటి నుంచి నౌకరు వచ్చి చెప్పాడు. 'నన్ను మోహన్‌రావుగారు రమ్మంటున్నారని'

వెళ్లాను

"ఈ మహానగరంలో యింత వరకూ మా అమ్మాయిని ఎవరూ అవమానించలేదు. దానికి ఎక్స్‌ప్లనేషన్స్ చెప్పడానికి ఎందుకు తిరస్కరించావ్" ఎత్తయిన సింహాసనం మీద కూర్చొని, తనేదో మహారాజుననే పోజుతో గద్దించాడు మోహన్‌రావు

తండ్రి పక్కనే బిక్క మొహంతో యువరాణిలా నిలబడి వుంది ఇందిర.

నేను సేవకుడ్నా?

"ఏం మాట్లాడవ్?"

"సారీ ట్యూషన్స్ చెప్పే అలవాటు నాకు లేదు

"నువ్వేమి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు అమ్మాయికి తెలియనివి నిన్ను అడుగుతుంది. వాటికి సమాధానం చెప్పు అంతే" అని మరోమాట లేకుండా లోనికి నిష్క్రమించాడు మోహన్‌రావు.

ఆ తర్వాత నా నిమిత్తం లేకుండానే ఇందిర నన్ను తన గదిలోకి లాక్కుపోయింది

ఆమెకు తెలియనివి ఎన్నో అడిగింది. అవి పుస్తకంలో పాఠాలు కావు జీవిత పాఠాలు.

"ప్రేమించడం ఎలా? అనుభవించడం ఎలా? ప్రేమకు క్లయిమాక్సు ఏమిటి? అనుభవానికి అంతం ఎక్కడ?"

మొదటిరోజు ఆమె ప్రశ్నలు యిలా సాగిపోయాయి

ఆ రోజే ఆమె తండ్రితో చెప్పేద్దామనుకున్నాను - ఆమెకు కావల్సింది చదువు కాదు సెక్స్ నాలెడ్జి అని. కానీ చెప్పలేకపోయాను.

ఆ తరువాత రోజు-

మరియాలీ సిన్మాల గురించి చర్చా వేదిక

నా బుర్ర గిర్రున తిరిగింది ఈమెకు పాఠాలు చెప్పడంకంటే సన్యాసం స్వీకరించడం సులభం.

నేనెంతగా పాఠాలు చెప్పి చూసినా ఆమె వినిపించుకొనేదికాదు పెద్దగా మందలిస్తే భోరున ఏడ్చేసేది.

ఆమెతోపాటు నాకూ విద్యాంగిపించింది.

కొన్ని నెలలు గడిచిపోయాక ఆమె అంది "మొదట్నించీ యీ వాతావరణంలో పుట్టి పెరిగానేమో. యీ జీవితం బోరు కొడుతోంది. అందుకే నీతో జీవితాన్ని

---



సంబరం

"ఏవిటక్కడ... జనం గోలగోల చేసి ఆనందంతో కేరింతలు కొడుతున్నారు" అడిగాడు పాపారావు కామారావుని.

"స్టేజిలో బిస్కాగిందట అదీ సంబరం" చెప్పాడు కామారావు

-పి వి రమణకుమార్ (చిలకలూరిపేట)

పెంచుకోవాలనుకుంటున్నాను"

"పెంచుకోడానికి యిదేమన్నా రొట్టి ముక్క అనుకుంటున్నావా?"

"జీవితం రొట్టిముక్క కాదని నాకు తెలుసు"

"తెల్సుకదా అందుకని నీకు పెళ్ళి చేయమని మీ నాన్నతో చెప్పు- మీ అంత స్తుకు తగినవాడ్ని చూస్తాడు"

"అంతస్తులు ఎన్నుంటే మాత్రం, వాక్కా వేసిన పునాది వుండాలిగా"

"తెలుగు సిన్మాలు తెలుగు నవల్స్ చదవడం మానేయ్"

ఇందిర విన్పించుకోలేదు

నన్ను ప్రేమించానంది.

మొదట నేను వొప్పుకోలేదు.

నేనులేనిదే బ్రతకనంది.

నిజమే అనుకున్నాను.

మన ప్రేమ అమరం అంది.

నేను పరవశించిపోయాను.

నిజానికి ఇందిరలాంటి అందగత్తె, పైగా ఐశ్వర్యమున్న అమ్మాయినికాదనే మూర్ఖులు వుండరు

అందుకే ఇందిర విషయంలో నేను మూర్ఖుడ్ని కాలేకపోయాను.

ఆ తర్వాత ఇందిరను నిజంగా ప్రేమించేయడం ప్రారంభించాను. ఎంత గొప్పగా లవ్ చేయాలో బుక్స్ రిఫర్ చేసి మరీ ప్రేమించేశాను. ప్రేమలేఖల పేరిట రీముల కొలదీ పేపర్స్ వేస్ట్ చేశాను. ప్రేమ పదాల్ని టన్నుల కొలదీ ఆమెమీద కుమ్మరించేశాను.

ఇందిర మీద ఎన్నో ఆశలు పెంచుకున్నాను. దాంపత్య జీవితం గురించి మరెన్నో కలలుగన్నాను. తప్పక మా పెళ్ళి జరిగితీరుతుందనే అనుకున్నాను.

ఇందిరతో నా తిరుగుళ్ళను మా యింట్లో వాళ్ళు ఎలా తెల్సుకున్నారో మరి! ప్రతి క్షణంగావే నన్ను హెచ్చరించారు

నేను ఆమాటల్ని లెక్కచేయలేదు. ఆనాడే కాస్త ఆలోచించి వుంటే ఈనాడు నాకింత అవమానం జరిగివుండేదికాదేమో!

అవమానం!

జీవితంలో ఏ మనిషి ఎదుర్కోని అవమానాన్ని ఎదుర్కొన్నాను. ఘోర మైన మానసిక క్షోభను అనుభవించాను. మరొకడైతే ఎప్పుడో ఆత్మహత్య చేసు కొనేవాడే

ఆనాడు-

గదిలో-ఇందిర నేను తెగ ప్రేమించేసు కుంటున్నాం. బయట ప్రపంచాన్ని మరచి వొకరి కౌగిలిలో మరొకరం వొదిగి వూహా లోకాల్లో తేలిపోతున్నాం.

అలా ఎంత సమయం గడిచిందో మాకే తెలీదు

హఠాత్‌గా గది తలుపులు తెరుచుకుంటే ఆమెను వదిలి అటు చూశాను.

నా మెదడులో నరాలు ఒక్కసారిగా తెగిపోయినట్లనిపించాయి వళ్ళంతా చెమట్లు పట్టసాగాయి

గుమ్మంలో నిలబడి వున్నాడు మోహన్‌రావు అతని కళ్ళు ఎరుపెక్కి వున్నాయి అతడి మొహం కందగడ్డలా కందిపోయి వుంది. అతడి పెదవులు కోపంతో అదురుతున్నాయి.

తండ్రిని చూడగానే బావురుమంటూ అతడివేపు పరిగెత్తింది ఇందిర.

నేను అయోమయంగా చూస్తుండి పోయాను.

"ఒంటరిగా వున్న ఆడపిల్లమీద యిలా అత్యాచారం చేయడానికి నీకు సిగ్గులేదు" మోహనరావు హుంకరిస్తూ అన్నాడు.

"లేదు.... కాదు...నేను ఇందిర... ఇందిర నేను..." ఏదో చెప్పాలనుకున్నాను. ఏమీ చెప్పలేక తడబడి పోయాను.

"యూ బాస్టర్డ్..." దగ్గరకు వచ్చి. యిూడ్చి నా చెంపమీద కొట్టాడు మోహనరావు. చెంప తడుముకుంటూ నిలబడి పోయాను దోషిలా.

ఇందిర ఎందుకో గుమ్మం దగ్గర నిలబడి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

బహుశా! మా ప్రేమ బయటపడిందనే భయంవల్లో లేక వాళ్ళనాన్న నన్ను కొట్టారన్న బాధవల్లో ఏది ఏమైనా ఆమె పెదవి కదపలేదు.

"నా కూతురు వంటిమీద చేయి వేయడానికి ఎంత ధైర్యంనీకు"

నా రెండో చెంపకూడా పగిలిపోయింది.

ఆ క్షణంలో నాలో ఏదో రోషం తలెత్తింది.

మోహనరావు కోపంగా ఏదో అరిచాడు.

"మేం ప్రేమించుకుంటున్నాం", అన్నాను పెద్దగా.

నిమిషంపాటు గదిలో నిశ్శబ్దం-

అనంతరం మోహనరావు ఒరలోంచి కత్తి లాగినట్లు పాంటుకున్న బెల్టులాగాడు.

నేను చలించలేదు. అమరప్రేమకు యిటువంటి దెబ్బలు సహజమే అనుకొని వీరప్రేమికుడిలా వళ్ళప్పగించాను.

బెల్టుదెబ్బలు ఓ అరడజను నా వంటిని తాకాయి. ఆ తర్వాత తెల్సింది అమర ప్రేమ దెబ్బలు భరించలేదని.

"ఆగండి" అని అరిచాను బిగ్గరగా.

## డిటెక్టివ్ ఈగ !



ఈగ డిటెక్టివ్ ఏమిటా అని ఆలోచిస్తున్నారా? అవునండీ ఇకముందు ఈగ డిటెక్టివ్‌లా పనిచేయబోతోంది. చికాగోలోని ఇలినాయిస్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ బెర్నార్డ్ గ్రీన్‌బర్గ్ హత్య జరిగిన ప్రదేశంలో ఉన్న ఈగల సహాయంతో హంతకుడ్ని గుర్తించవచ్చునని బల్లగుద్ది చెప్తున్నాడు. అలా ఈగల సాక్ష్యాన్ని అందజేసినందుకు అతడికి మూడువందల డాలర్లు చెల్లించవలసి ఉంటుంది. ఇప్పటికే గ్రీన్‌బర్గ్ కొన్ని హత్యానేరాలలో హంతకుడ్ని ఈగల సాక్ష్యంతో గుర్తించగలిగాడట! సో ఇకనుండి మీ ఇంట్లోకి వచ్చిన ఈగల్ని చూసి చీదరించుకోకండేం!

-జూపిటర్

మోహనరావు క్రూరంగా నావేపు చూశాడు

"ఏం! కావాలంటే ఇందిరను అడగండి ఆమె నన్ను ప్రేమించింది మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం"

గాయాల్లోంచి నెత్తురోడుతున్నా ఎలాగో ఆ మాటల్ని చెప్పగలిగాను.

అదే సమయంలో-

అంతవరకు ఏడుస్తున్న ఇందిర పకపకమని నవ్వుతున్నట్లు అనిపించింది

ఇవేం పట్టనట్టు బండబూతులు యింగ్లీషులో తిడుతూ, తెలుగు జానపద స్టైలులో నన్ను మరో నాలుగు దెబ్బలు కొట్టేశాడు మోహనరావు

అప్పటికే యీ దృశ్యాన్ని కిటికీల్లోంచి, గుమ్మం దగ్గర్నుండి తొంగి చూస్తున్నారు ఆ యింటి నౌకర్లు

ఆ అవమానాన్ని భరించలేకపోయాను

"ఈ లోఫర్ని నేను ప్రేమించడమా" అన్నట్లు వుంది ఇందిర వంచకి

ఎంత గొప్పగా తప్పుకున్నావే!

పాతకి...

ఎంత గొప్పగా నటిస్తున్నావే!

మోసపోయాను-ఎదురు తిరిగి మోహనరావు గాడ్ని, ఇందిరను నాలుగు తన్నాలనే ఆలోచనే లేకుండా పోయింది.

మరో అయిదు నిమిషాల అనంతరం-నౌకర్లచే ఆ యింట్లోంచి బయటకు గెంటబడ్డాను.

ఈ సంఘటన జరిగాక నా మెదడు మొద్దుబారిపోయింది. నాకు పిచ్చెక్కినట్లనిపించింది. తిక్క రేగినట్లనిపించింది

నా వంటిమీద దెబ్బలు నాలుగు రోజులకే తగ్గిపోయాయి-కానీ, నా గుండె మీద తగిలినదెబ్బ ఎప్పటికీ మానిపోదు

దెబ్బకు దెబ్బ తీయాలి. వాళ్ళను మరింత అవమానించాలి ప్రతీకారజ్వాలలు నన్ను చుట్టు ముడుతున్నాయి. గుండెల్లో అగ్ని పర్వతాలు బద్దలవుతున్నాయి

కాలేజీకి వెళ్ళడం మానేశాను

ఎప్పుడూ యింట్లో కూర్చొని కిటికీలోంచి కన్పిస్తున్న ఇందిర వాళ్ళ బిల్డింగ్ చూస్తూ, పిచ్చిగా కాలం గడిపేస్తున్నాను.

అమ్మా, నాన్నలు నన్ను తెగ తిడుతున్నారు. వాళ్ళు నా భవిష్యత్తు నాశనం అయిపోతుందేమోనని, భయపడుతున్నారు-బాధపడుతున్నారు

ఎవరేమనుకున్నా-నా ఆలోచనలు మాత్రం వేరే విధంగా సాగిపోతున్నాయ్.

మోహనరావుగాడ్ని ఎలా అవమానించాలి?

నడిరోడ్డుమీద వాడి మొహానికి పేడ పులిమితేనో-వాడి బట్టలు విప్పించేసి పరిగెట్టిస్తేనో-ఏం చేయాలి?

ఇందిరను ఎలా అవమానించాలి?

దానికీ-నాకూ సంబంధముందని కాలేజీ గోడలమీద రాయిస్తేనో- లేక రేప్ చేస్తే-ఏంచేయాలి?

తల పగిలిపోయే ఆలోచన్లు

ఏదోవిధంగా వాళ్ళమీద కక్ష సాధించాలి.

చాలారోజులు వేస్టుగా గడిచిపోయాయి.

నాలో కసి పెరిగిపోతూ వుంది. ఏదో చేసేయాలనే తపన నన్ను ఒక్క చోట కూడా నిలబడనీయడం లేదు

నాలో పిచ్చి ముదిరిపోతోంది. ఏమీ

చేయలేకపోతున్నానవే బాధ నన్నుమరింత కృంగదీస్తోంది

మరో ఆరునెలలు గడిచిపోయాయ్.

పరీక్షల్లో ఘోరంగా ఫేలయ్యాను. నాన్న యిష్టం వచ్చినట్లు తిట్టాడు. అమ్మ గొల్లున ఏడ్చింది.

నా ఫెయిల్యూర్‌కి కారణం ఇందిర !

నాన్న నన్ను తిట్టడానికి కారణం ఇందిర !!

అమ్మ ఏడ్వడానికికారణం ఇందిర !!!

కనుక- ఇందిరను వదలకూడదు. తీవితంలో మర్చిపోలేని అవమానం చేయాలి

పిచ్చికుక్కలా రోడ్లమీద తిరుగుతున్నాను. ఎవరైనా మిత్రులు కన్పించి, పలకరిస్తే, కారణం లేకుండానే కరిచేస్తున్నాను

ఓ రోజు చెల్లాయి చెప్పింది- "ఇందిరకు పెళ్ళిరా అన్నాయ్."

నా గుండె భగ్గున మండిపోయింది.

నాకసి తీరకుండానే ఇందిర అత్తవారింటికి పెళ్ళిపోతుందా? లేదు- వెళ్ళకూడదు.

ఆ రాత్రినుండి నా ఆలోచన్లు తీవ్రతరమయ్యాయి. ఎంత ఆలోచించినా నా కసి తీరే మార్గం కనిపించలేదు

ఇందిర పెళ్ళి దగ్గరపడుతోంది.

ఏంచేయాలి?

ఇందిర పెళ్ళి కొన్నిరోజుల్లోనే.

ఏంచేయాలి?


ఇందిర పెళ్ళి చాలా త్వరలోనే.

ఏంచేయాలి?

జుట్టు పీక్కున్నాను. మదురు కొట్టుకున్నాను. గోళ్ళుగిల్లుకున్నాను. అయినా ఏంచేయాలో బోధపడలేదు.

చివరికి పెళ్ళిరోజు రానేవచ్చింది.

పెళ్ళి ఎప్పుడో అర్ధరాత్రి దాటాక అట!



సందడాడే ఆరంభమయింది సంబరం- ఆ బిల్డింగ్‌తో పాటు ఆ వీధి అంతా రంగు రంగుల బల్బులతో అలంకరించారు. ఇంద్ర భవనంలా వెలిగిపోతోంది ఆ యిల్లు.

ముహూర్త సమయానికి చాలా ఖరీదైన వాళ్ళు తరలివచ్చారు. ఆ వీధి నిండా నిండిపోయాయ్ చిన్నకార్లు.

నాలో సంఘర్షణ మొదలైంది వచ్చిన అతిథులకు దూరంగా, ఎవరికీ కనిపించకుండా ఓ మూలగా నిలబడి వున్నాను నేను.

దూరంగా పెళ్ళి వేదిక అందంగా అలంకరించబడి వుంది. ఇందిర పక్కగా వున్న పెళ్ళికొడుకు చీపురుపుల్లలా వున్నాడు. ఇందిర చీపురుకట్టలా వుంది. వేదిక ముందున్న మోహనరావు బలిసిన జలగలా వున్నాడు

ఇంకా వికృతంగా వాళ్ళను వర్ణించాలని వుంది. ఇంకా పచ్చిగా వాళ్ళను తిట్టాలని వుంది

బ్యాండు మేళం వాళ్ళు తాగొచ్చి యిష్టం వచ్చినట్లు వాయించేస్తున్నారు. పీకల వరకు మెక్కిన బంధువులు కుషీగా కబుర్లు చెప్పుకుంటున్నారు

ఇందిర పెళ్ళికూతురు వేషంలో గొప్పగా నటిస్తోంది. పెళ్ళికొడుకు నటించడం చేతకాని హాస్య నటుడిలా దిక్కులు చూస్తున్నాడు

మోహన్‌రావు హడావుడిగా అటుయిటు తిరుగుతున్నాడు.

మాంగల్యం కట్టమని పురోహితుడు అరుస్తున్నాడు

నా నరనరాల్లోనూ పేరుకుపోయివున్న కసి ఒక్కసారిగా వుప్పొంగింది. ఏదో అద్భుతశక్తి నన్ను విసురుగా ముందుకు తోసినట్లనిపించింది.

వాయువేగంతో వేదికవేపు పరుగు తీశాను.

వంగొని తాళికట్టబోతున్న పెళ్ళికొడుకు నడ్డిమీద బలంగా తన్నాను.

వాడు కెవ్వున అరుస్తూ వేదిక్కి అవతల వేపు పడిపోయాడు.

జనం ఆశ్చర్యంతో చూస్తున్నారు.

ఇందిర భయం-భయంగా నావేపు చూసింది.

ఆ కళ్ళను చూసి మరింత తసెక్కిపోయాను ఆమె జబ్బల్ని పట్టుకొని బలంగా పైకి లేవదీశాను.

అంతే! గట్టిగా ఆమె పెదవులపై ముద్దు పెట్టుకున్నాను.

ఎక్కడి వాళ్ళక్కడ నిర్ఘాంతపోయి చూస్తుండిపోయారు.

ఇందిరను వదిలి గిరుక్కున వెనుదిరిగాను.

అంతా నిశ్శబ్దం-

ఒక్క క్షణం అందరివేపూ చూసి తాపీగా బయటకు నడిచాను.

ఏ ఒక్కరూ నన్ను ఆపడానికి ప్రయత్నించలేదు.

రోడ్డుమీదకు చేరుకొనేసరికి-నా వెనుక కలవరం వినిపించింది. మోహనరావుగాడు గగ్గోలుగా అరుస్తున్నాడు.

ఇప్పుడు నాకు చాలా ప్రశాంతంగా వుంది.

ఆ వీధి వెంట మెల్లిగా నడుస్తూ రంగు దీపాల్ని దాటుకుంటూ... అలా చీకట్లోకి... ఎక్కడికో వెడుతున్నాను.

నా వెనక జనం పరిగెత్తుకుంటూ వస్తున్నట్లు అడుగుల చప్పుళ్ళు వినబడుతున్నాయ్.

*